క్లుప్తంగా

రోడ్డు వెడల్పునకు అధికారులు చర్యలు



ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కొలతలు వేయిస్తున్న జేఈ సుజాత

కోడుమూరు: స్థానికంగా రోడ్డు వెడల్పునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి కర్నూలు రహదారి వెంట కొందరు ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలు నిర్మించుకున్నారు. ఆ ప్రాంతంలో శనివారం ఆర్‌అండ్‌బీ జేఈ సుజాత సర్వేయర్లతో కొలతలు వేయించి అక్రమార్కులకు నోటీసులు జారీ చేశారు. రోడ్డు వెడల్పునకు సహకరించాలని జేఈ ఈసందర్భంగా చెప్పారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ప్రియమైన రోజు కావడంతో శనివారం ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. స్థానిక గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

'సుంకేసుల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శనివారం 8,520 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. దీంతో డ్యాంకు చెందిన ఒక గేట్‌ను మీటరు మేర, మరో గేట్‌ను అర మీటర్ మేర ఎత్తి దిగువకు 4,710 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు పేర్కొన్నారు. డ్యాంలో ప్రస్తుతం 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మారథాన్ రన్‌లో జిల్లాకు మూడో బహుమతి

కర్నూలు(హాస్పిటల్): హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని భావించి శనివారం రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించిన 5కె మారథాన్ రన్‌లో కర్నూలు జిల్లాకు 3వ, 7వ స్థానాలు దక్కాయి. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఎ. దినకర్ 3వ స్థానాన్ని, షేక్షావలి 7వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు వీరిని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ భాస్కర్, సెట్కూరు సీఈవో పీవీ. రమణ అభినందించారు.

శిశువు మృతదేహం

పాణ్యం: చనిపోయిన నవజాత శిశువును ఎవరో ఖననం చేయకుండా పారవేశారు. దానిని శనివారం కుక్కలు ఈడ్చుకెళ్తుండగా పాణ్యం ఎస్సీ కాలనీ వాసులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.వారు పంచాయతీ సిబ్బందికి తెలపడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గ్రామ శివారులో ఖననం చేశారు.

నేడు స్వచ్ఛత కార్యక్రమం

కోడుమూరు రూరల్: సంతమార్కెట్ మైదానంలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీపీఓ నాగరాజునాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలా కలెక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొంటారని వెల్లడించారు.


యువకుడికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నాడు. గాయాలై ఉండటంతో హైవే సిబ్బంది గుర్తించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ యువకుడు సిమెంట్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్‌గా గుర్తించినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. స్పృహలోకి వస్తే వివరాలు తెలుస్తాయని ఆయన వెల్లడించారు. యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు నారీ శక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: నారీ శక్తి సమ్మేళనం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీఆర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ట్లు నిర్వాహకులు రాధిక, దేవకిదేవి తెలిపారు.

పాణ్యం తహసీల్దార్‌గా శ్రీనివాసులు గౌడ్



శ్రీనివాసులు గౌడ్‌తో డీటీ మల్లికార్జునరెడ్డి

పాణ్యం: పాణ్యం మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు గౌడ్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌ఐ మహేశ్వరరెడ్డితో పాటు సిబ్బంది ఆయనకు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.






కోడుమూరులో .. వైద్య సేవలపై సూచనలిస్తున్న స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, ఆలమూరులో మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ, గడివేములలో బీపీ చెక్ చేస్తున్న దృశ్యం , పోలకల్‌లో కంటి అద్దాలు అందజేస్తున్న డీడీ శ్యామల, ఎంపీపీ బొంతల మునెప్ప

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశం అదే
- కోరటమద్ది గ్రామంలో మెడికల్ క్యాంపు
- పరిశీలించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కొరటమద్దిలో ఆరోగ్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని



పోలకల్ ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో సేవలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

గడివేముల: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వందలాది మంది క్యాంపునకు వచ్చి బీపీ, షుగరు, మలేరియా, టైఫాయిడ్, డెంగీతో పాటు పలు ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని మెడికల్ క్యాంపును పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు స్థానికంగానే అవసరమైన వైద్యసేవలు అందిస్తుందన్నారు. తండ్రి వైఎస్ఆర్‌లా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య నిపుణుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌కుమార్, ప్రత్యూష, సౌమిత్, మొల్లా జాబీన్, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రామనాథం శనివారం కొరటమద్ది గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపును తనిఖీ చేశారు. క్యాంపునకు వచ్చిన ప్రజలతో సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

కల్లూరు: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, కర్నూలు డివిజన్ అధికారి (డీఎల్‌డీఓ) పి.బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి ఉలిందకొండ సచివాలయం-1లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 496 మందికి సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకులమ్మ, ఎంపీటీసీ అనురాధ, నాయకులు రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) రమణ, ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

ఆలమూరు గ్రామంలో...

పాణ్యం: మండలంలో తొలి రోజు ' జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపును ఆలమూరు గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ ముల్ల మహ్మద్‌షరీఫ్, ఎంపీడీఓ దస్తగిరి, మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీతా ప్రారంభించారు. మొత్తం 488 మందికి ఓపీ చూడగా 62 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. కంటి వెలుగు ద్వారా 150 మందికి పరీక్షలు చేసి అద్దాలకు రెఫర్ చేశారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన స్టేట్ నోడల్ ఆఫీసర్

గూడూరు రూరల్: కె.నాగలాపురంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం విజయవాడ నుంచి వచ్చిన జేఏఎస్ ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి పరిశీలించారు. ఓపీ, వైద్యుల వివరాలు, రోగులకు అందిస్తున్న సేవలపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు.

కోడుమూరు రూరల్: స్థానిక సంతమార్కెట్ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే డా.సుధాకర్ సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. తర్వాత ఆయన మాట్లాడారు. క్యాంపునకు సుమారు 300మందికిపైగా ప్రజలు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, వైద్య సిబ్బంది వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, డీఎల్‌పీఓ తిమ్మక్క, స్పెషలాఫీసర్ రంగాలక్ష్మిదేవి, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్లు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలతో పాటు మందులు అందజేయండి

నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును శనివారం స్టేట్ డిప్యూటీ డైరెక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి రవీంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంపులో వైద్య సిబ్బంది ప్రజలకందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. క్యాంపునకు వచ్చే ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య పరీక్షలు చేయడంతో పాటు, మందులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

❝చాలా సంతోషంగా ఉంది



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా మా ఊరిలోనే వైద్య సేవలు ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని విధంగా జగన్ ప్రభుత్వం చేస్తుంది.నేను బీపీ, గ్యాస్ ట్రబుల్ రోగాలతో బాధపడుతున్నాను. వైద్య కోసం కర్నూలుకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసుకున్నాను. ఇప్పుడు గ్రామంలోనే ఆ వ్యాధులకు ఉచితంగా సేవలు ఇస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చా. అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఇచ్చారు.

–నాగలక్ష్మమ్మ, కొరటమద్ది గ్రామం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మా లాంటి పేదలు వైద్యానికి ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. అందుకు సీఎం సార్‌కు కృతజ్ఞతలు. మా గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త, ఏఎన్ఎం ఇంటింటికి వచ్చి బీపీ, షుగర్ పరీక్షలు చేసి శనివారం జరిగే వైద్య శిబిరానికి రావాలని చెప్పారు. దాంతో ఇక్కడకు వచ్చి డాక్టర్లతో చూపించుకున్నాను. నాకు అవసరమైన మందులు ఉచితంగా అందించారు.

– మాసుం వలి, ఉలిందకొండ

❝మందులు ఇచ్చారు



వయస్సు మీద పడుతుండటంతో నొప్పుల అధికమవుతున్నాయి. బయట ఎంత మంది డాక్టర్లకు చూపించినా తగ్గడం లేదు. చాలా రకాల మందులు వాడినా ప్రయోజనం లేదు. పైసా ఖర్చులేకుండా నాకు వైద్య శిబిరం వద్ద పరీక్షలు చేసి నొప్పులకు తగిన మందులు ఇచ్చారు. క్రమం తప్పకుండా మందులు వాడితే నొప్పులు తగ్గుతాయని భరోసా ఇచ్చారు. మా సొంతూరులోనే వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది.

– సి. తిరుపెంరెడ్డి, వృద్ధుడు,పాణ్యం

పేదలకు ఆరోగ్య భరోసా



గార్గేయపురంలో రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్/గూడూరు రూరల్/కర్నూలు సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్య భరోసా ఇస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం సి. బెళగల్ మండలం పోలకల్ , గూడూరు మండలం కె. నాగులాపురం గ్రామాల్లో జనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఈ శిబిరాలను ఎమ్మెల్యే సందర్శించి సేవలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వివిధ రోగాలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులు ఇస్తున్నారన్నారు. గతంలో ఇలాంటి కార్యక్రమం ఎవరూ చేపట్టలేదన్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో నిర్వహించే ప్రతి క్యాంపులో ఈసీజీ సదుపాయం కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్యకు ఫోన్‌లో చెప్పారు.

హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పోలకల్ క్యాంపులో 414 మందికి వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ హరిచంద్రుడు తెలిపారు. ఈ క్యాంప్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండల ప్రత్యేకాధికారిణి, మత్స్యశాఖ డీడీ శ్యామల తనిఖీ చేశారు. పోలకల్‌లో జరిగిన కార్యక్రమంలో సి. బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప, మండలాధికారులు, కె. నాగులాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సునీత, వైస్ ఎంపీపీ రాజమ్మ, సుంకులమ్మ గుడి చైర్మన్ ఉమామహేశ్వరి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు ఫ్యామిలీ డాక్టర్ ధనవంతులకే మాత్రమే ఉండేవారని, ఇప్పుడు పేదలకు సైతం ఫ్యామిలీ డాక్టర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. అనంతరం కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నెహెమ్యా, సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఎంపీటీసీ జ్యోతిలత, సింగిల్ విండో చైర్మెన్ వినయ్‌కుమార్ రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, మాజీ డైరెక్టర్ మాబాషా, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రీ, సర్పంచ్ విద్యాసాగర్, సురేష్, ఏసేపు, శివరాముడు, తదితరులు పాల్గొన్నారు.






పోలకల్‌లోని జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌కు పోటెత్తిన ప్రజలు, చిన్న పిల్లలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీల్, ఉలిదకొండ వైద్య శిబిరంలో పేషెంట్లకు మందులు ఇస్తున్న సిబ్బంది, శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

ఆరోగ్య సురక్షకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి

- ఎమ్మెల్యే డా.సుధాకర్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే నగరంలోని తన ఇంట్లో కోడుమూరు, గూడూరు, కర్నూలు, సి. బెళగల్ మండలాలకు చెందిన అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు.

మానవ మృగాలను ఉరితీయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

పాణ్యం: చిత్తూరు జిల్లా పెనుమలూరులో భవ్యశ్రీ హత్యకు కారకులైన మానవ మృగాలను వెంటనే ఉరితీయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు పాణ్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

పంట నమోదుతో ప్రయోజనాలు



పంట నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు రూరల్: ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయడం ద్వారా రైతులకు చాలా ప్రయోజనాలు కలుగుతాయని తహసీల్దార్ జయన్న అన్నారు. శనివారం కోడుమూరులో ఆర్బీకే సిబ్బంది, వీఆర్వోలు నమోదు చేసిన పంట నమోదును తహసీల్దార్ పునః పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నమోదులో నిర్లక్ష్యం వహించరాదన్నారు. సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని ఆదేశించారు.

మేల్ నర్సుపై దాడి చేసిన హౌస్‌సర్జన్ల సస్పెన్షన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మేల్ నర్సు ఇర్ఫాన్‌పై దాడి చేసిన ముగ్గురు హౌస్‌సర్జన్లను శనివారం అధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 26వ తేది రాత్రి క్యాజువాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఇర్ఫాన్‌పై కొందరు హౌస్‌సర్జన్లు దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడికి సంబంధించి సైకియాట్రి హెచ్‌ఓడీ డాక్టర్ నాగేశ్వరరావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటతులశమ్మలతో విచారణ కమిటీ వేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం కమిటీ విచారణ చేపట్టింది. శనివారం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చర్చించారు. దాడికి పాల్పడిన హర్ష, ఐనకల్‌పై నెలరోజుల పాటు, సాయిచరణ్‌పై 15 రోజుల పాటు సస్పెన్షన్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్ ఉన్న సమయంలో వారు ఆసుపత్రిలో డ్యూటీలకు రాకూడదని, సస్పెన్షన్ కాలాన్ని వారి హౌస్‌సర్జన్ ముగిసిన అనంతరం పనిచేయాలని సూచించారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

కర్నూలు సిటీ: తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం గార్గేయపురంలోని సింగిల్ విండో సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు స్థానికంగానే అవసరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను తీసుకొచ్చిందన్నారు. పంటలకు మద్దతు ధర కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ వినయ్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ సోమేశ్వరి, ఎంపీటీసీ జ్యోతిలత, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాబాషా, సురేష్, ఏసేపు, ఆదాం, శివరాముడు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

పాణ్యం: వ్యాధులు దరిచేరకూడదంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రి అన్నారు. శనివారం ఆ కళాశాల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు.

ఉలిందకొండలో పశు వైద్య శిబిరం

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో అపార్డ్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఉలిందకొండ పశు వైద్యాధికారి డాక్టర్ దీప్తి, అపార్డ్, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

6న కోడుమూరులో జాబ్ మేళా

కర్నూలు సిటీ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ శనివారం ఆవిష్కరించారు. నగరంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 8500783459, 8309283980, 8374376305 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ వై.రామాంజనేయులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ఆర్‌సీపీదే అధికారం

- గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని



బిలకలగూడూరులో వృద్ధురాలిని పలకరిస్తున్న ఎమ్మెల్యే

గడివేముల: ప్రజల స్పందన చూస్తుంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ఆర్‌సీపీదే అధికారమని స్పష్టమవుతుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బిలకలగూడూరు గ్రామంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటూ..సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబునాయుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ అధ్యక్షుడు శివరామిరెడ్డి, సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ రామస్వామి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓపీఆర్‌డీ ఖాలిక్, ఏఈలు మూర్తి, భాస్కర్, పవన్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివానందరెడ్డి, వెంకట క్రిష్ణారెడ్డి, మేఘనాథరెడ్డి, రఘుమాధవ రెడ్డి, రామ లింగేశ్వరరెడ్డి, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్ర రాజధానికి 70 ఏళ్లు

కర్నూలు సిటీ: మొదటి భాషా ప్రయుక్త రాష్ట్ర రాజధానిగా కర్నూలు ఏర్పడి నేటి (ఆదివారం)తో 70 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని శనివారం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఆ కాలేజీ, కర్నూలు జిల్లా మేధావుల కన్సార్టియం ఆధ్వర్యంలో కర్నూలు వైభవం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్ కర్నూలు వైభవం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాయలసీమ ముఖద్వారామైన కర్నూలు జిల్లాలో ఎందరో ప్రముఖులు జన్మించారన్నారు. అయినా ఇప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అనంతరం ఆచార్య మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ 1858 జూలై 1వ తేదీన పరిపాలన సౌలభ్యం కోసం 8 తాలూకాలతో కర్నూలు జిల్లా ఏర్పాటు అయ్యిందన్నారు. 1953 అక్టోబరు 1వ తేదీన ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా కర్నూలు ఎంపికై, 1956 అక్టోబరు 31వ తేది వరకు సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లా చరిత్ర గురించి చరిత్ర అధ్యాపకులు జె.చెన్నయ్య వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు ఆదినారాయణ రెడ్డి, మాదన్న, వెంకటస్వామి, డా.డి నాగన్న, మురళీధర్, డా.ఉమర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిది అని ఆర్టీసీ డైరెక్టర్ ఎ. రాజారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక కర్నూలు-1డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఆర్టీసీ ఉద్యోగులను పట్టించుకోలేదన్నారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 12019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని చెప్పారు. బడ్జెట్‌లో రూ. వేలకోట్లు కేటాయించి ఆర్టీసీకి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. నష్టాలను నివారించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన రాయితీలు ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేశారు.